AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAYNEWS.COM
5-10-2026 (Monday)
MAIN EDITION

త్వరలో మున్సిపల్ శాఖలో 886 పోస్టుల భర్తీ



అక్షరటుడే, హైదరాబాద్ : తెలంగాణలో మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ పరిధిలో వార్డు అధికారులు నుంచి గ్రేడ్ 2, గ్రేడ్ 3 మున్సిపల్ కమిషనర్ల వరకు మొత్తం 886 పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. 2027 జనవరిలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ ద్వారా నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉంది. మొత్తం 886 పోస్టులను భర్తీ చేయనున్నట్లు సమాచారం.

తిరుమల అలిపిరి దారిలో చిరుత సంచారం



అక్షరటుడే, తిరుమల : తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దర్శనార్థం వెళ్లే అలిపిరి కాలినడక మార్గంలో చిరుతపులి కదలికలు మరోసారి తీవ్ర కలకలం రేపాయి. అలిపిరి మార్గంలోని 'మోకాలి మిట్ట' సమీపంలో వేకువజామున సుమారు రెండు గంటల సమయంలో చిరుత సంచరిస్తూ కనిపించింది. వెంటనే టీటీడీ అధికారులు, అటవీ శాఖ సిబ్బంది తక్షణమే స్పందించి అప్రమత్తమయ్యారు. టీటీడీ భద్రతా సిబ్బంది, అటవీ అధికారులు ఆయా ప్రాంతాల్లో పహారాను మరింత తీవ్రతరం చేశారు.

భారీ జీఎస్టీ స్కామ్



అక్షరటుడే, ఏపీ : చిత్తూరు జిల్లాలో జీఎస్టీ స్కామ్ బయటపడింది. చిన్న వ్యాపారులు, సామాన్యులకు కొంత డబ్బు ఆశ చూపి వారి ఆధార్, పాన్ కార్డులను సేకరించిన ముఠా.. వారి పేర్లతో నకిలీ జీఎస్టీ రిజిస్ట్రేషన్లు, బ్యాంక్ ఖాతాలు తెరిచింది. అనంతరం బాధితులకు తెలియకుండానే వారి ఖాతాల ద్వారా వందల కోట్ల లావాదేవీలు నడిపారు.

ఓటును వేరు చేయడం అంటే ఆత్మను వేరు చేసినట్లే..



అక్షరటుడే, హైదరాబాద్ సిటీ : భారత పౌరుల ఓటు హక్కును హరించే ఎలాంటి ప్రక్రియ అయినా సరే, అది రాజ్యాంగ వ్యవస్థను, దాని ఆత్మను దెబ్బతీయడమేనని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ అత్యంత ఘాటుగా హెచ్చరించారు. హైదరాబాద్‌లోని నల్సార్ విశ్వవిద్యాలయంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

లిస్టింగ్‌లో అ'ధర'గొట్టిన ఓరియంట్ కేబుల్స్



అక్షరటుడే, బిజినెస్‌డెస్క్: ఓరియంట్ కేబుల్స్ కంపెనీ షేర్లు సోమవారం స్టాక్ మార్కెట్‌లో లిస్టయ్యాయి. ఐపీవో అలాట్ అయినవారికి ప్రారంభంలోనే 65 శాతం లాభాలను అందించాయి. కంపెనీ ఒక్కో ఈక్విటీ షేరును రూ. 272కు విక్రయించగా.. సోమవారం ఉదయం 65.44 శాతం లాభాలతో రూ. 450 వద్ద లిస్టయ్యింది.

సింగరేణి భవన్ ముట్టడి



అక్షరటుడే, హైదరాబాద్ : సింగరేణి కార్మికులకు ఆదాయ పన్ను రద్దు చేయాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌ను టీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం ఆమె ముట్టడించారు. సింగరేణి లాభాల్లో కార్మికులకు 35 శాతం వాటా చెల్లించాలన్నారు. మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకున్న కార్మికులందరినీ అన్‌ఫిట్ చేసి, వారి వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులకు హై పవర్ కమిటీ సిఫార్సుల మేరకు జీతాలు చెల్లించాలని కవిత డిమాండ్ చేశారు.

ఢిల్లీ అల్లర్లపై పిటిషన్‌ను కొట్టేసిన హైకోర్టు



అక్షరటుడే, న్యూఢిల్లీ : ఢిల్లీ అల్లర్లపై దాఖలైన పిటిషన్‌ను సోమవారం హైకోర్టు కొట్టివేసింది. 2020లో ఈశాన్య ఢిల్లీ అల్లర్లు చోటు చేసుకున్నాయి. ఆ సమయంలో విద్వేషపూరిత ప్రసంగాలు చేసిన నాయకులపై చర్యలు తీసుకోవాలని దాఖలైన పిటిషన్లను ధర్మాసనం తిరస్కరించింది. సీఏఏ, ఎన్ఆర్సీ నిరసనల సందర్భంగా రాజకీయ నాయకులు చేసిన ప్రసంగాలే ఈశాన్య ఢిల్లీలో అల్లర్లను రెచ్చగొట్టి, చివరికి 50 మందికి పైగా మరణానికి దారితీశాయని కొందరు పిటిషన్ దాఖలు చేశారు. ఆ నాయకులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని పిటిషనర్లు కోరారు. ఈ పిటిషన్‌ను జస్టిస్ వివేక్ చౌదరి, మనోజ్ జైన్‌లతో కూడిన ధర్మాసనం కొట్టివేసింది.



వారి గుండెల్లో భయం పుట్టించాలి

దేశంలో రోజురోజుకు మహిళలపై లైంగిక దాడులు, వేధింపులు పెరిగిపోతున్నాయి. పోలీసులు కేసులు పెడుతున్నా.. ప్రభుత్వాలు కఠిన చట్టాలు తీసుకొస్తున్నా.. అత్యాచార ఘటనలు తగ్గకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఈ క్రమంలో సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. లైంగిన నేరం చేయాలి అని ఆలోచన రావాలంటేనే నేరస్తుల గుండెల్లో భయం పుట్టాలని పేర్కొంది. వారి మనసుల్లో భయం సృష్టించాలని పోలీసులను ఆదేశించింది.

- అక్షరటుడే, నేషనల్ డెస్క్

■ లైంగిక నేరాలపై సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు

■ అత్యాచార ఘటనలపై సుమోటగా విచారణ ■ ఢిల్లీ పోలీసులకు కీలక ఆదేశాలు

ఢిల్లీ, పరిసర ప్రాంతాల్లో ఇటీవల జరిగిన అత్యాచార ఘటనలపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుమోటోగా విచారణ చేపట్టింది. లైంగిక నేరానికి పాల్పడితే కచ్చితంగా మరణశిక్ష, మరణం తప్పదనే భయాన్ని అసాంఘిక శక్తుల మనసుల్లో కలిగించకపోతే ఇలాంటి నేరాలు జరుగుతూనే ఉంటాయని కోర్టు పేర్కొంది. దక్షిణ ఢిల్లీలోని ఒక బాలికల కళాశాలకు 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న పార్కులో జరిగిన సామూహిక అత్యాచార ఘటనను ప్రస్తావిస్తూ, పోలీసులు తీసుకోవాల్సిన ముందస్తు చర్యల గురించి సుప్రీంకోర్టు వారిని ప్రశ్నించింది. "ఇలాంటి నేరాలకు పాల్పడే వారి మనసులో ఒక రకమైన భయం, ఆందోళన ఉండాలి. 'ఇప్పుడు ఏదైనా చేస్తే చచ్చిపోతాం' అనే భయం వారిలో కలిగించకపోతే, ఇలాంటి నేరాలను అరికట్టడం సాధ్యం కాదు" అని ధర్మాసనం పేర్కొంది.

వార్ రూమ్ ఏర్పాటు చేయాలి

ఇలాంటి నేరాలు ఆగిపోయేలా చూడాలని, మనం కలిసి పనిచేస్తే మార్పు తీసుకురావచ్చు అని జస్టిస్ పార్దీవాలా అన్నారు. రాజధానిలో ఈ సమస్యను పరిష్కరించడానికి ఒక 'వార్ రూమ్' ఏర్పాటు చేయాలని సూచించారు. అనుమానితుల కదలికలను పర్యవేక్షించాలని కూడా కోర్టు సూచించింది. కాలేజీల వద్ద ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించింది. అక్కడ అమ్మాయిలను వేధించే గూండాలు తిరుగుతుంటారని పేర్కొంది. ఢిల్లీ అంతటా వేలాది అనధికారిక ఆహార విక్రయ కేంద్రాలు ఉన్నాయని, అక్కడ అసాంఘిక శక్తులు గుమిగూడుతాయని తమకు తెలిసిందన్నారు. ఈ విషయంలో కఠినంగా వ్యవహరించాలని ఢిల్లీ పోలీసులను సుప్రీంకోర్టు ఆదేశించింది. మానవ హక్కుల వంటి సమస్యలు ఎదురైనా.. అవసరం అయినప్పుడు కఠిన చర్యలు తీసుకోవాలని కోర్టు పేర్కొంది.

'అమరజీవి జలధార' జల్ జీవన్ మిషన్ ప్రారంభం



అక్షరటుడే, ఏపీ : రాయలసీమలోని పొద్దుటూరు నియోజకవర్గంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ సంయుక్తంగా పర్యటించారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం రూ. 30,156 కోట్ల భారీ అంచనా వ్యయంతో చేపట్టిన "జల్ జీవన్ మిషన్ 2.0 అమరజీవి జలధార" పథకానికి నేతలు ఘనంగా శ్రీకారం చుట్టారు. కొత్తపల్లి వద్ద ప్రత్యేక పైలాన్‌ను ఆవిష్కరించి, రాష్ట్రంలోని 27 లక్షల పైచిలుకు గ్రామీణ కుటుంబాలకు కుళాయి కనెక్షన్ ద్వారా సురక్షిత మైన తాగునీరు అందించే మహాయజ్ఞానికి శ్రీకారం చుట్టారు.

ట్రేడ్ డీల్‌పై ఆర్థిక మంత్రి సంచలన ప్రకటన



అక్షరటుడే, బిజినెస్ డెస్క్: భారత్, అమెరికా దేశాల మధ్య వాణిజ్య ఒప్పందం ఇంకా తుదిరూపు సంతరించుకోలేదు. ఇరు దేశాల మధ్య పలుసార్లు చర్చలు జరిగినప్పటికీ ఎలాంటి స్పష్టత రాలేదు. ఈ నేపథ్యంలో ఢిల్లీలో జరిగిన బిజినెస్ లీడర్స్ సదస్సులో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడారు. ప్రస్తుతం ఈ ట్రేడ్ చర్చలు ఒక దశలో నిలిచిపోయినట్లు కనిపిస్తున్నాయని, ఇకపై ఇరు దేశాల మధ్య రాయితీలు ఇచ్చుకోవడం దాదాపు అసాధ్యంగా మారిందని పేర్కొన్నారు. అయితే అందుబాటులో ఉన్న అవకాశాలను బట్టి భవిష్యత్తులో చర్చలు ముందుకు వెళ్లే అవకాశం ఉండొచ్చని అభిప్రాయపడ్డారు.

బాలాపూర్‌లో భారీ అగ్ని ప్రమాదం



అక్షరటుడే, హైదరాబాద్ సిటీ : హైదరాబాద్‌లోని బాలాపూర్‌లో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఓ ప్లాస్టిక్ గోదాములో అర్ధరాత్రి మంటలు చెలరేగాయి. నబీల్ కాలనీలోని గోదాములో మంటలు చెలరేగగా, లోపల నిల్వ ఉంచిన పాత రసాయనాల డ్రమ్ములు పేలిపోయాయి. గోదాము నుంచి దట్టమైన పొగలు అలుముకోవడంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని అధికారులు తెలిపారు.

మేడిపల్లిలోని డైమండ్స్ జువెల్లరీలో భారీ చోరీ



అక్షరటుడే, మేడ్చల్ : మేడ్చల్‌మల్కాజ్‌గిరి జిల్లాలోని మేడిపల్లిలో భారీ చోరీ జరిగింది. క్యారట్‌లేన్ డైమండ్స్ జువెల్లరీ దుకాణంలో సోమవారం తెల్లవారుజామున దొంగలు రూ.2కోట్లకుపైగా విలువైన ఆభరణాలను ఎత్తుకెళ్లారు. ఈ దుకాణం హైదరాబాద్‌వరంగల్ జాతీయ రహదారి పక్కన ఉంది. దొంగలు షట్టర్‌ను వంచి లోనికి ప్రవేశించారు. అనంతరం గాజు డిస్‌ప్లే కేసులను పగలగొట్టి వజ్రాల ఆభరణాలను తీసుకుపోయారు. అపహరణకు గురైన ఆభరణాల కచ్చితమైన విలువ ఇంకా అధికారికంగా నిర్ధారించబడలేదు. అయితే రూ.2 కోట్లకు పైగా ఉంటుందని అంచనా. మేడిపల్లి పోలీసులు దుకాణానికి చేరుకుని ప్రాంగణాన్ని తనిఖీ చేశారు. కేసు నమోదు చేసుకొని నిందితుల కోసం గాలిస్తున్నారు.

గాంధీజీని అవమానించేలా రీల్.. మహిళ అరెస్ట్



అక్షరటుడే, గుజరాత్ : మహాత్మా గాంధీజీని అవమానించేలా రీల్ పోస్ట్ చేసిన మహిళను పోలీసులు అరెస్ట్ చేశారు. గుజరాత్‌లోని సూరత్‌లో గాంధీ చిత్రం ఉన్న రూ. 500 నోటును అభ్యంతరకర రీతిలో పట్టుకున్నట్లుగా ఒక రీల్‌ను పోస్ట్ చేసినందుకు ఒక కంటెంట్ క్రియేటర్‌ను అదుపులోకి తీసుకున్నారు. సిమ్రాన్ పటేల్ అనే మహిళ అక్టోబర్ 1న సోషల్ మీడియాలో ఒక వీడియో పోస్టు చేసింది. ఆ వీడియోలో ఆమె గాంధీజీకి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలపడంతో పాటు అభ్యంతకరంగా నోటును పట్టుకుంది. ఈ వీడియో వైరల్ కావడంతో పోలీసులు స్పందించారు. ఆమెను అదుపులోకి తీసుకున్నారు.

బిష్ణోయ్ గ్యాంగ్‌పై పోలీసుల కాల్పులు



అక్షరటుడే, ఢిల్లీ : ఢిల్లీలోని యమునా ఖాదర్ ప్రాంతంలో లారెన్స్ బిష్ణోయ్, రషీద్ కేబుల్ వాలా గ్యాంగ్‌లకు చెందిన ఇద్దరు అనుమానిత అనుచరులు పోలీసుల ఎన్‌కౌంటర్‌లో గాయపడ్డారు. అనంతరం నిందితులను అరెస్ట్ చేసినట్లు పోలీసులు సోమవారం తెలిపారు. ఈశాన్య ఢిల్లీలో పోలీసులు, దుండగులకు మధ్య ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఉస్మాన్‌పూర్ ప్రాంతంలో ఆదివారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసుల ఎదురుకాల్పుల్లో ఇద్దరు దుండగులు గాయపడ్డారు. వీరిని మహమ్మద్ కైఫ్, మహమ్మద్ జాసీమ్‌గా గుర్తించారు. వీరికి లారెన్స్ బిష్ణోయ్, రషీద్ కేబుల్‌వాలా ముఠాలతో సంబంధాలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వీరు డబ్బు వసూలు చేసేందుకు అక్టోబర్ 2న భజన్‌పురా ప్రాంతంలోని ఒక వ్యాపారవేత్త ఇంటి బయట కాల్పులు జరిపారు.